నిజామాబాద్‌లో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా జడ్జి సునీత కుంచాల

గ్రామస్థాయిలో న్యాయసేవలు విస్తరించాలి

- నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల
- ఉమ్మడి జిల్లాలో జాతీయ లోక్ అదాలత్
- నిజామాబాద్‌లో 14,537, కామారెడ్డిలో 3,397 కేసులు పరిష్కారం

వినాయక్‌నగర్, డిసెంబర్ 14: గ్రామస్థాయిలో న్యాయసేవలు విస్తరించాలని, చట్ట పరిజ్ఞానాన్ని ప్రజలకు మరింత చేరువ చేయాలని నిజామాబాద్ జిల్లా న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాల్లో శనివారం జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమాలను నిర్వహించారు. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని కోర్టులో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా నిర్వహించిన లోక్ అదాలత్‌లో మొత్తం 14,537 కేసులను పరిష్కరించినట్లు వెల్లడించారు. కేసుల పరిష్కారం కోసం రెండు నెలలకు ఒకసారి పెద్ద ఎత్తున జాతీయ లోక్ అదాలత్‌తోపాటు ప్రతిరోజూ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అంకిత్ కుమార్, బార్ అధ్యక్షుడు జగన్‌మోహన్, సీనియర్ సివిల్ జడ్జి శ్రీకాంత్ బాబు, జూనియర్ సివిల్ జడ్జిలు కుష్బూ ఉపాధ్యాయ్, గోపీ కృష్ణ, చైతన్య, హరికుమార్, శ్రీనివాసరావు, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా రీజనల్ మేనేజర్ మహేశ్వర్ పాల్గొన్నారు. లోక్ అదాలత్‌లో 68 రోడ్డు ప్రమాదాల కేసుల్లో రూ.5 కోట్ల 68లక్షల 20 వేల అవార్డులను జారీ చేశారు. 389 బ్యాంకు కేసులను సెటిల్ చేసి, రూ.2 కోట్ల 22 లక్షల 85 వేలు, 14 ల్యాండ్ కేసుల్లో రాజీ కుదిర్చి రూ.61 లక్షల 37 వేల 785 అవార్డులను జారీ చేశారు. 39 సైబర్ క్రైం కేసులను సెటిల్ చేసి రూ.3 లక్షల 4వేల 894, బీఎస్ఎన్ఎల్ శాఖ సంబంధిత 149 కేసుల్లో రూ.లక్షా11వేల 885 అవార్డులను జారీ చేశారు. అనంతరం విద్యుత్ శాఖ ఉద్యోగి కుటుంబానికి రాజీపద్ధతిన రూ.కోటీ 25 లక్షలకు లోక్ అదాలత్ అవార్డును జిల్లా జడ్జి, అదనపు కలెక్టర్ చేతుల మీదుగా అందజేశారు.

లోక్‌అదాలత్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలి

కామారెడ్డి, డిసెంబర్ 14 : లోక్ అదాలత్‌పై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని కామారెడ్డి జిల్లా ప్రధానన్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కామారెడ్డి పట్టణంలోని కోర్టు భవనంలో నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో ఆయన మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా మొత్తం 3,397 కేసులను పరిష్కరించామని వెల్లడించారు. ఇందులో క్రిమినల్ కేసులు 3,335, సివిల్ కేసులు 12, ప్రీ లిటికేషన్ కేసులు 50 ఉన్నాయని వివరించారు. పలు కేసుల్లో మొత్తం రూ.86,40,226 అవార్డు జారీ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జి నాగరాణి, జిల్లా అదనపు న్యాయమూర్తి లాల్‌సింగ్ నాయక్, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి సుధాకర్, అడిషనల్ జ్యుడిషియల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ దీక్ష, పబ్లిక్ ప్రాసిక్యూటర్ రాజగోపాల్‌గౌడ్, అశోక్ శివరాం, నిమ్మ దామోదర్ రెడ్డి, ఏజీపీ డిఫెన్స్ కౌన్సిల్ న్యాయవాదులు మాయ సురేశ్, మోహన్ రావు, శ్రీనివాస్ రావు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీకాంత్‌గౌడ్, జిల్లా కోర్టు సూపరింటెండెంట్ చంద్రసేన్ రెడ్డి, భుజంగరావు పాల్గొన్నారు.

కామారెడ్డిలో నిర్వహించిన లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి సీహెచ్‌వీఆర్‌ఆర్ వరప్రసాద్

వృద్ధాప్య వయస్సు సడలింపు.. అభాగ్యులకు అండగా కేసీఆర్...

కేసీఆర్ హయాంలో పింఛన్ల పంపిణీని సామాజిక బాధ్యతగా అమలు చేశారు. ఏ దిక్కూ లేని వారందరినీ పింఛన్ల పరిధిలోకి తీసుకువచ్చి కేసీఆర్ కొండంత అండగా నిలిచారు. పింఛన్ల అంటే గతంలో వృద్ధాప్య సాయం మాత్రమే. బీడీ కార్మికులకు సైతం ఆదరణ లేకుండా పోయేది. కానీ కేసీఆర్.. ఒంటరి మహిళలు, ఎయిడ్స్, దోమకాలు వ్యాధిగ్రస్తులు, కల్లు గీత కార్మికులు, వితంతువులు తదితర అట్టడుగు వర్గాలకు అండగా నిలబడి, పింఛన్లను బాధ్యతగా సామాజిక కోణంలో చూశారు. అనేక వర్గాలకు పెన్షన్ సకాలంలో అందజేసి చూపించారు. తెలంగాణ వ్యాప్తంగా ప్రతీ కుటుంబంలోనూ ఏదో రకంగా పింఛన్ అందుతుందంటే అది కేసీఆర్ గొప్పతనమే. గతంలో 65 ఏండ్లు నిండిన వారికే వృద్ధాప్య పెన్షన్ వచ్చేది. కేసీఆర్ ఆ వయస్సును 57 ఏండ్లకు కుదించి అర్హులందరికీ సాయం అందించారు. ఇచ్చిన మాటకు కట్టుబడ్డారు. ప్రస్తుతం కొత్త దరఖాస్తుల స్వీకరణ లేదు. ఇచ్చిన హామీకి దిక్కు లేకుండా పోయింది.

కాంగ్రెస్ హయాంలో ప్రహసనం...

సమైక్యాంధ్ర ప్రదేశ్‌లో వృద్ధాప్య పింఛన్లు దక్కాలంటే అదో ప్రహసనంగా ఉండేది. దరఖాస్తు చేసుకున్న లక్షలాది మందిలో కొద్ది మందికి మాత్రమే బొటాబొటిన ఇచ్చే రూ.200 పింఛన్ చేతికి చిక్కేది. అది కూడా దళారులు, మధ్యవర్తులు కమీషన్లు పుచ్చుకోగా.. నడవ చాతకాని వృద్ధులకు చేరేది గగనమే అయ్యేది. నిజామాబాద్ జిల్లాలో ప్రతి నెలా సుమారు 2 లక్షల 51 వేల 910 మందికి వివిధ రకాల పింఛన్లు అందుతున్నాయి. ఇందుకోసం ప్రభుత్వం రూ.52.70 కోట్లు మంజూరు చేస్తున్నది. కామారెడ్డి జిల్లాలో లక్షా 53 వేల 879 మందికి లబ్ధిదారులు ఉండగా.. నెలకు రూ.32.84 కోట్లు మంజూరవుతున్నాయి. ఆరు గ్యారెంటీల్లో భాగంగా కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత కింద రూ.4 వేలు పెన్షన్ అందిస్తామని చెప్పింది. ఎన్నికల ప్రచారంలో ఏఐసీసీ అగ్రనేతలంతా పదే పదే ఈ విషయాన్ని నొక్కి చెప్పి ప్రజలను తమవైపు తిప్పుకున్నారు. కానిప్పుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోక పోగా, పింఛన్లు అడిగితే ప్రజలనే కాంగ్రెస్ నేతలు దూషిస్తున్నారు.

పెన్షన్ల పెంపు ఇంకెప్పుడు?

- రూ.4 వేలు ఇవ్వాలంటున్న లబ్ధిదారులు
- గ్రామాల్లో కాంగ్రెస్ నేతల నిలదీతలు
- ప్రభుత్వం వచ్చి ఏడాది అవుతున్నా అమలు కానీ పెంపుదల
- రూ.2 వేలతోనే సరిపెడుతున్న సర్కారు
- వాటికీ ఎదురుచూపులే..

నిజామాబాద్, డిసెంబర్ 14 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : తమ ప్రభుత్వం రాగానే పెన్షన్లను రూ. 2 వేల నుంచి రూ. 4 వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ నేతలు.. అధికారంలోకి రాగానే ఇచ్చిన హామీని మరిచిపోయారు. రేవంత్ రెడ్డి సీఎంగా ప్రమాణ స్వీకారం చేసి ఏడాది పూర్తయినా ఇంతవరకూ పెన్షన్ల పెంపుదల లేదు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ అలవికాని హామీలిచ్చి గద్దెనెక్కింది. ఇప్పుడు అమలుచేసేందుకు తచ్చాడున్నది. సామాన్య ప్రజలను ఆశల పల్లకీలో ఊరేగించి.. ఇప్పుడు అటు వైపు కన్నెత్తి కూడా చూడడం లేదు. గ్రామాల్లో పెన్షన్ల పెంపు కోసం వృద్ధులు వేయి కండ్లతో ఎదురుచూస్తున్నారు. ప్రస్తుతం నెలకు రూ.2,016 మాత్రమే చేతికి అందుతున్నది. ఇది కూడా కేసీఆర్ హయాంలో పెంచిన మొత్తమే.

రూ. 2,016కూ ఎదురుచూపులే..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పింఛన్ల పంపిణీ ప్రక్రియలో తీవ్ర గందరగోళం చోటు చేసుకుంటున్నది. సమయానికి పింఛన్ డబ్బులు రావడం లేదు. రోజుల తరబడి తాత్సారం చేసి, పింఛన్ మంజూరు చేస్తున్నారు. కేసీఆర్ హయాంలో అభాగ్యులందరికీ పింఛన్ సమయానికి వచ్చేవి. నెల తిరిగే సరికి చేతిలో డబ్బులు ఉండేవి. కానిప్పుడు అలాంటి పరిస్థితి లేకుండా పోయింది. వారం, రెండు వారాల జాప్యంతో పెన్షన్లు మంజూరు అవుతుండగా రూ.4 వేల పెంపు మాత్రం అటకెక్కింది.

తగ్గేదేలే..

- ఏమాత్రం భయపడని ఇసుకాసురులు
- యథేచ్ఛగా పెద్దవాగులో ఇసుక తవ్వకాలు
- అర్ధరాత్రి హైవేపై ట్రాక్టర్ల పరుగులు
- ఏమాత్రం స్పందించని జిల్లా అధికారులు
- యంత్రాంగాన్ని గుప్పిట పట్టిన అధికార పార్టీ నేతలు

శుక్రవారం అర్ధరాత్రి గాండ్లపేట్ పెద్దవాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

మోర్తాడ్, డిసెంబర్ 14: ఇసుకాసురులు ఏమాత్రం తొణకడం లేదు. మమ్మల్ని ఎవరు ఆపేది అన్న రీతిలో పెద్ద వాగును తోడేస్తున్నారు. యంత్రాంగాన్ని గుప్పిట పట్టిన అధికార పార్టీ నేతలు అర్ధరాత్రి గాండ్లపేట్ శివారులోని వాగులో వాలిపోతున్నారు. గ్రామ కమిటీకి రూ.18 లక్షలు, అధికారులకు రూ. లక్షల్లో ముడుపులు చెల్లించిన అక్రమార్కులు.. ఇసుక తరలింపు నిలిపివేస్తే నష్టపోవాల్సి వస్తుందని, ఏ మాత్రం భయం లేకుండా రెచ్చిపోతున్నారు. జాతీయ రహదారికి సమీపంలోనే, రైల్వే బ్రిడ్జి పక్కన తవ్వకాలు చేపడుతూ వ్యవస్థలకు సవాల్ విసురుతున్నారు. జేసీబీ, ట్రాక్టర్లతో వందల కొద్దీ ట్రిప్పులను తరలిస్తున్నారు. వారం రోజులుగా ఇసుక దోపిడీ జరుగుతున్నా అధికారులు స్పందించడం లేదు. శుక్రవారం మూడు ట్రాక్టర్లను సీజ్ చేసి మమ అనిపించారు. కానీ, అదేరోజు రాత్రి మళ్లీ గాండ్లపేట్ శివారులోని వాగులో ట్రాక్టర్లు ప్రత్యక్షమయ్యాయి. పదుల సంఖ్యలో ట్రాక్టర్లు అక్రమ ఇసుకతో హైవేపై పరుగులు పెడుతూ, ఇతర వాహనాలకు ఇబ్బంది కలిగించాయి. నిత్యం రాత్రివేళ ఇసుక దోపిడీ యథేచ్ఛగా జరుగుతున్నా అధికారులు స్పందించక పోవడం విస్మయానికి గురి చేస్తున్నది. మరోవైపు, అధికార పార్టీ నేతల ఇసుక దందాపై, సహకరిస్తున్న అధికారుల తీరుపై 'నమస్తే తెలంగాణ' వరుస కథనాలు ప్రచురిస్తున్నా జిల్లా యంత్రాంగం స్పందించక పోవడం అనేక అనుమానాలకు తావిస్తున్నది. కింది నుంచి పైస్థాయి దాకా ముడుపులు ముడుతుండడంతోనే డివిజన్, జిల్లా స్థాయి అధికారులు కిమ్మనడం లేదన్న చర్చ జరుగుతున్నది. జిల్లా మైనింగ్, రెవెన్యూ అధికారులు, కలెక్టర్ వరకూ ఎవరూ ఎందుకు స్పందించడం లేదన్న సందేహం తలెత్తుతున్నది.

ప్రభుత్వం ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేస్తూ సర్వశిక్షా అభియాన్ ఉద్యోగులు ఈనెల 10 నుంచి నిరవధిక సమ్మెకు దిగారు. సమస్యలు పరిష్కరించాలని అధికారులకు వినతిపత్రాలు అందజేసినా, నిరసనలు చేపట్టినా ప్రభుత్వం స్పందించడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. సమ్మె శనివారం ఐదో రోజుకు చేరుకోగా.. కామారెడ్డి జిల్లాకేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఎస్ఎస్ఏ ఉద్యోగులు మోకాళ్లపై నిలబడి నిరసన తెలిపారు.

రుణమాఫీ చాలామందికి కాలేదు..

- సీఎం దృష్టికి తీసుకెళ్లి చేయించండి
- బోధన్ ఎమ్మెల్యేకు డీసీసీ అధ్యక్షుడి వినతి

ఏర్గట్ల, డిసెంబర్ 14: చాలా మంది రైతులకు రుణమాఫీ కాలేదని, ఈ విషయాన్ని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి అందరికీ మాఫీ చేయించాలని నిజామాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు మానాల మోహన్ రెడ్డి.. బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డికి విన్నవించారు. ఏర్గట్లలో శనివారం నిర్వహించిన ప్రజాపాలన ప్రజా విజయోత్సవాల్లో ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ఈరవత్రి అనిల్, కో-ఆపరేటివ్ యూనియన్ కార్పొరేషన్ చైర్మన్, డీసీసీ అధ్యక్షుడు మానాల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. తమ ప్రాంతంలో రైతులు ఎక్కువగా ఉంటారని, వారిలో చాలా మందికి రుణమాఫీ వర్తించలేదన్నారు. ఈ విషయాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్లాలని ఎమ్మెల్యేకు విజ్ఞప్తి చేశారు.

మూడో వంతు మందికే మాఫీ

పెద్దకొడప్‌గల్, డిసెంబర్ 14 : పెద్దకొడప్‌గల్ సొసైటీ పరిధిలో మూడో వంతు మంది రైతులకు మాత్రమే రుణమాఫీ వర్తించిందని, మిగతా వారికి కూడా మాఫీ చేయాలని కాంగ్రెస్ నాయకులు కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు విజ్ఞప్తి చేశారు. పెద్దకొడప్‌గల్‌లోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కామన్ డైట్ మెనూ ప్రారంభోత్సవానికి కలెక్టర్ శనివారం వచ్చారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మండలాధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, రైతులు ఆయనను కలిసి వినతిపత్రం అందజేశారు. సొసైటీ పరిధిలో 1217 మంది రైతులకుగాను కేవలం 423 మందికే రుణమాఫీ అయ్యిందని, మిగతా వారికి మాఫీ కాలేదని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. రైతులు ఆధార్, బ్యాంక్ ఖాతాలు, పట్టా పాస్‌బుక్ జిరాక్స్‌లతో అధికారుల చుట్టూ తిరుగుతున్నా మాఫీ కావడం లేదన్నారు. రైతులకు న్యాయం చేయాలని, రుణమాఫీ వర్తించేలా చూడాలని కోరారు.

పెద్దకొడప్‌గల్‌లో కామారెడ్డి కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సమావేశంలో వివరాలను వెల్లడిస్తున్న కామారెడ్డి ఎస్పీ సింధూశర్మ

దొంగనోట్ల ముఠా గుట్టు రట్టు

- ఆరుగురి అరెస్టు.. పరారీలో మరో ఇద్దరు
- రూ.56.90 లక్షల విలువైన ఫేక్ కరెన్సీ స్వాధీనం

పోలీసులు స్వాధీనం చేసుకున్న ఫేక్ కరెన్సీ

కామారెడ్డి, డిసెంబర్ 14 : దొంగనోట్లు తయారు చేసి, చలామణి చేస్తున్న అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టు చేశారు కామారెడ్డి జిల్లా పోలీసులు. ఆరుగురిని అరెస్టు చేసి, రూ.56.90 లక్షల విలువైన నకిలీ నోట్లను, కరెన్సీ తయారు చేసే సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం గాలిస్తున్నారు. కామారెడ్డి ఎస్పీ సింధూ శర్మ శనివారం తన కార్యాలయంలో అడిషనల్ ఎస్పీ నరసింహారెడ్డితో కలిసి కేసు వివరాలను విలేకరులకు వెల్లడించారు. బాన్సువాడ కొయ్యగుట్ట వద్ద శుక్రవారం వాహనాలను తనిఖీ చేస్తుండగా, పోలీసులను చూసి కొందరు కారులో పారిపోయేందుకు యత్నించారు. వారిని పట్టుకుని కారులో పరిశీలించగా, రూ.30 లక్షల విలువ చేసే రూ.500 నకిలీ నోట్లు లభ్యమయ్యాయి. ఈ క్రమంలో పోలీసులు లోతుగా దర్యాప్తు చేపట్టగా ముఠా వ్యవహారం వెలుగు చూసింది. తెలంగాణ, రాజస్థాన్, కర్ణాటక, ఉత్తరాఖండ్, మహారాష్ట్రకు చెందిన 8 మంది ముఠాగా ఏర్పడ్డారు. తెలంగాణకు చెందిన రాజగోపాల్, కర్ణాటకకు చెందిన హుస్సేనీ పీరా.. ఫేక్ కరెన్సీ తయారీ, చలామణి కోసం పెట్టుబడి పెట్టారు. హైదరాబాద్ బోయిన్‌పల్లిలో ఇటీవల రూ.60 లక్షల విలువైన రూ.500 నకిలీ నోట్లను ప్రింటింగ్ చేశారు. కామారెడ్డి జిల్లా బిచ్కుందకు చెందిన కిరణ్‌కుమార్, బాన్సువాడకు చెందిన రమేశ్‌గౌడ్, మహారాష్ట్ర వాసులు అజయ్, ఈశ్వర్ నకిలీ నోట్లు చలామణి చేస్తున్నారు. కిరణ్‌కుమార్, రమేశ్‌గౌడ్ రూ.3 లక్షల నకిలీ కరెన్సీని తమ చుట్టుపక్కల గ్రామాల్లో చలామణి చేశారు. ఈ క్రమంలో మార్కెట్‌లో చలామణి చేసేందుకు మరో రూ.30 లక్షలను తీసుకుని హైదరాబాద్ నుంచి రాజగోపాల్ శుక్రవారం బాన్సువాడకు వచ్చాడు. అతడ్ని బస్టాండ్‌లో దింపడానికి కిరణ్‌కుమార్, రమేశ్‌గౌడ్ కారులో బయల్దేరగా, కొయ్యగుట్ట వద్ద పోలీసులకు చిక్కారు. విచారణలో నిందితులు ఇచ్చిన సమాచారంతో బోయిన్‌పల్లిలో తనిఖీలు చేపట్టగా, రూ.26.90 లక్షల ఫేక్ కరెన్సీ లభ్యమైంది. దీంతో రాజగోపాల్, హుస్సేన్ పీరా, కిరణ్‌కుమార్, రమేశ్‌గౌడ్, రాధాకృష్ణ, అజయ్ ఈశ్వర్‌ను పోలీసులు అరెస్టు చేశారు. పరారీలో ఉన్న కమలేశ్, సుఖరాం కోసం గాలిస్తున్నారు. ఫేక్ కరెన్సీ తయారు చేసే కంప్యూటర్, ప్రింటర్, పేపర్ బండిళ్లు, ఆరు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుని, నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఎస్పీ తెలిపారు. చాకచక్యంగా కేసును ఛేదించిన సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, బాన్సువాడ టౌన్ ఇన్‌స్పెక్టర్ అశోక్, పిట్లం ఎస్సై రాజు, సీసీఎస్ ఎస్సై ఉస్మాన్, రాజేశ్వర్, సిబ్బంది సురేందర్, కిషన్, గణపతి, రాజేందర్, శ్రావణ్‌ను ప్రత్యేకంగా అభినందించారు.

రెంజల్ మండలంలో దారుణం

- సంతకు వెళ్లిన బాలికపై అఘాయిత్యం
- నిందితుడికి దేహశుద్ధి.. పోలీసులకు అప్పగింత

రెంజల్, డిసెంబర్ 14: రెంజల్ మండలంలోని ఓ గ్రామంలో దారుణం చోటు చేసుకున్నది. శనివారం స్థానికంగా జరిగే సంతకు తల్లితో కలిసి వెళ్లిన తొమ్మిదేండ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడ్డాడో దుర్మార్గుడు. స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకారం.. గ్రామంలో ప్రతి శనివారం జరిగే సంతకు ఓ మహిళ తన కూతురు (9)తో కలిసి వచ్చింది. ఆమె కూరగాయలు కొనుగోలు చేస్తుండగా, బాలిక పక్కకు వెళ్లింది. ఇది గమనించిన మహారాష్ట్రకు చెందిన ఓ వ్యక్తి బాలికకు రూ.20 ఆశ చూపి, కొద్దిదూరంలోని ప్రభుత్వ భవనం వెనుకకు తీసుకెళ్లి అఘాయిత్యానికి పాల్పడ్డాడు. కూతురు కనిపించకుండా పోవడంతో తల్లి వెతుకుతుండగా, యువకుడు తీసుకెళ్లినట్లు స్థానికులు తెలిపారు. అంతా కలిసి వెతుకుండగా, బాలిక ఆచూకీ లభించింది. ఎక్కడకు వెళ్లావని ప్రశ్నించగా, జరిగిన దారుణం గురించి చెప్పింది. దీంతో స్థానికులు నిందితుడ్ని పట్టుకుని చితకబాదారు. బాధితురాలి తల్లి డయల్ 100కు కాల్ చేయడంతో పోలీసులు వచ్చి నిందితుడ్ని అదుపులోకి తీసుకున్నారు. బాలిక నుంచి వివరాలు సేకరిస్తున్నామని రెంజల్ ఎస్సై సాయన్న తెలిపారు.

గ్రూప్-2 పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

- నేడు, రేపు రెండు సెషన్లలో పరీక్షలు
- నిజామాబాద్‌లో 63, కామారెడ్డిలో 19 పరీక్షా కేంద్రాల ఏర్పాటు

కంఠేశ్వర్ / కామారెడ్డి, డిసెంబర్ 14 : టీఎస్‌పీఎస్సీ ద్వారా ఈనెల 15, 16వ తేదీల్లో నిర్వహించే గ్రూప్-2 పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామని నిజామాబాద్ కలెక్టర్ రాజీవ్ గాంధీ హన్మంతు తెలిపారు. రెండు రోజుల పాటు ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు మొదటి సెషన్, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు సెకండ్ సెషన్ పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలో మొత్తం 19,854 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరు కానున్నారని, ఇందుకు గాను 63 పరీక్షాకేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. పరీక్షల సమయం కన్నా అరగంట ముందే గేట్లను మూసివేస్తామని పేర్కొన్నారు. అభ్యర్థులు నిర్ణీత సమయానికి ముందే కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. అభ్యర్థులు హాల్‌టికెట్‌తోపాటు ఏదైనా గుర్తింపు కార్డును వెంట తెచ్చుకోవాలని స్పష్టంచేశారు.

కామారెడ్డి జిల్లాలో 8,085 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని, ఇందుకు గాను 19 పరీక్షా కేంద్రాలను ఏర్పాటుచేసినట్లు అధికారులు తెలిపారు. 190 మంది దివ్యాంగ అభ్యర్థులకు కామారెడ్డి పట్టణంలోని ప్రభుత్వ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో వింగ్ ఏ, బీ గదులను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. పరీక్షను స్వయంగా రాయలేని వారి కోసం 23 మందిని సహాయకులుగా నియమించామని, అలాంటి అభ్యర్థులు సదరం సర్టిఫికెట్ తప్పనిసరిగా చూపించాల్సి ఉంటుందని పేర్కొన్నారు.

సాందీపని కళాశాలలో నంబర్లు వేస్తున్న అధ్యాపకులు